క్లుప్తంగా

చదువుతోనే జీవితాల్లో మార్పు



విద్యార్థులను అభినందిస్తున్న సేవ భారత్ ట్రస్ట్ సభ్యులు, సీఐ జయానాయక్

రాయదుర్గంటౌన్: చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందని అర్బన్‌సీఐ జయానాయక్ తెలిపారు. సేవ భారత్ ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్స్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన 50 మంది విద్యార్థులకు స్థానిక ఎపీఎన్జీవో భవన్‌లో అభినందన సభ నిర్వహించారు. సీఐ జయానాయక్ వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంత్, కొట్రేష్, సేవ భారత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కుమార్, ఆకలి బంధం అధ్యక్షుడు నాగయ్య, శ్రీరామ్ ఫౌండేషన్ అనూష పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి



ఉరవకొండ మటన్ వ్యాపారులకు సూచనలు చేస్తున్న ఈఓ గౌస్‌సాహెబ్

ఉరవకొండ: నాణ్యమైన పొట్టేలు మాంసాన్ని వినియోగదారులకు విక్రయించాలని మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ సూచించారు. ఆదివారం ఉరవకొండలోని గవిమఠం ఆవరణలో ఉన్న మటన్, చికెన్, చేపల మార్కెట్లను ఈఓ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మటన్ మార్కెట్ వద్ద అపరిశుభ్రత లేకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను దూరంగా పారబోయాలన్నారు. చికెన్ వ్యాపారులు కూడా ప్రజలకు నాణ్యమైన చికెన్ అందించాలని సూచించారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ

కూడేరు: మండల కేంద్రంలోని జోడు లింగాల సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణుల అన్నదాన సత్రం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కూడేరుకు చెందిన బ్రాహ్మణులంతా కలిసి సుమారు రూ.25 లక్షలతో అన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. శివశంకర్ శాస్త్రి, సుధాకర్, ప్రవీణ్, ప్రసాద్ రావు, మరికొందరు బ్రాహ్మణులు మాట్లాడారు.

మినరల్ వాటర్‌ప్లాంట్లు మూత



పాత కూరగాయల మార్కెట్ వద్ద మూతపడిన వాటర్‌ప్లాంట్

కణేకల్లు: మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మినరల్ వాటర్‌ప్లాంట్లు మూతబడటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. శుద్ధి చేసిన నీరు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో పంచాయతీ అధికారులు పాత కూరగాయల మార్కెట్ వద్ద ఒక వాటర్‌ప్లాంట్ లిటిల్ ఏంజిల్స్ స్కూల్ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు సిబ్బందిని నియమించి, బిందె నీరు రూ.5లకు అందించారు. మినరల్ వాటర్ కోసం రోజూ ప్రజలు క్యూ కట్టేవారు. ప్రైవేట్ వ్యక్తులు బిందె నీరు రూ.10 నుంచి 15 వరకు విక్రయిస్తుండేవారు. ఆరు నెలల క్రితం రెండు వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. చిన్న మరమ్మతుల కారణంగా మూసేశారని వారం, పదిరోజుల్లో ప్లాంట్లు తెరుస్తారని ప్రజలు ఆశతో ఎదురుచూసినా, నేటికీ తెరవలేదు.

26 నుంచి మద్దానేశ్వర స్వామి పశువుల జాతర

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళంలో వెలసిన మద్దానేశ్వరస్వామి 81వ రథోత్సవం ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందని ఈఓ నరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 28 నుంచి మార్చి 8 వరకు పశువుల జాతర జరుగుతుందన్నారు. 26న రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, పురాణ హరికథా శ్రవణం, 27న కళశస్థాపన, గంగపూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తుశాంతి హోమం, పూర్ణాహుతి, 28న సాయంత్రం 4.30 గంటలకు బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. మార్చి 8న ముత్యాలపల్లకీ ఉత్సవంతో జాతర ముగుస్తుందన్నారు.

యువతి అదృశ్యం

ఉరవకొండ: రాకెట్ల గ్రామానికి చెందిన పూజారి హనుమప్ప, లక్ష్మి దంపతుల కుమార్తె అమృత కనిపించలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఆదివారం తెలిపారు. యువతి ఆచూకీ తెలిస్తే అర్బన్ సీఐ సెల్:9490108514, ఎస్‌ఐ: 9440740876కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సర్కారు విద్య.. తిరోగమనం

- మాటలకూ చేతలకు పొంతన లేని కూటమి సర్కారు
- 30 పాఠశాలల్లో నిరుపయోగంగా వాటర్ ప్లాంట్లు
- నిధులు నిలిపివేయడంతో ఆగిన 'నాడు–నేడు' నిర్మాణాలు



రాయదుర్గంలో మధ్యాహ్న భోజనం కోసం ఇంటి నుంచి నీళ్ల బాటిళ్లను తెచ్చుకున్న విద్యార్థినులు



రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో నిలిచిన అదనపు గదుల నిర్మాణం

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత విద్యారంగం తిరోగమనంలోకి వెళ్లింది. సర్కారు విద్య, పాఠశాలల అభివృద్ధికి సీఎం చంద్రబాబు మంగళం పాడారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో టోఫెల్, జీవో 117 రద్దు, తల్లికి వందనమంటూ అమ్మఒడికి ఎగనామం పెట్టారు. కూటమి సర్కారు హామీలకు చేతలకు పొంతనలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు.

రాయదుర్గం అర్బన్‌లో 40 పాఠశాలలు, మండల పరిధిలో 38 పాఠశాలలు (మొత్తం 78 పాఠశాలలు) ఉన్నాయి. వీటిలో 13,908 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు రెండో విడతలో 11 పాఠశాలల్లో భవన నిర్మాణాలకు (అదనపు గదులు) రూ.6.68 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టారు. కొన్ని లింటల్ లెవెల్, మరికొన్ని భవనాలకు స్లాబ్‌లు పూర్తయ్యాయి. ఈ సమయంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నిధులు పూర్తిగా నిలిపివేశారు. నాడు–నేడు పనులు ఎక్కడికక్కడే అర్ధంతరంగా నిలిచిపోయాయి. అదనపు గదులు అందుబాటులోకి రాలేదు. నిధులు లేక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నూతన భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వైఎస్ జగన్ తన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులతో అడుగులు వేశారు. నాడు–నేడుతో ఎవరూ ఊహించని విధంగా రూపురేఖలు మార్చి ప్రైవేటు, కార్పొరేట్‌కు ధీటుగా పేద కుటుంబాల పిల్లలకు చదువులు అందజేశారు. పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దారు.

తాగునీటికి ఇక్కట్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో నాడు–నేడు కింద రూ.లక్షల్లో వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతుకు నోచుకోలేదు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి ఉంది. తాగునీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొన్ని పాఠశాల్లో ఉప్పునీరు, మున్సిపల్ కొళాయిల్లో వచ్చే నీరు తాగాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు మొదటి కింద రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 78 పాఠశాలల్లో మొదటి విడతలో 44 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటిలో పట్టణంలో 19, మండలంలోని 11 పాఠశాలాల్లో వాటర్ ప్లాంట్లు పనిచేయలేదు.



బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంట్

ఉన్నతాధికారులకు నివేదించాం



పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు కావాల్సి వుంది. ఎన్ని పాఠశాలల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి, ఏ దశలో ఉన్నాయనే విషయాలు, వాటి పురోగతి గురించి ఉన్నతాధికారులకు నివేదించాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే భవన నిర్మాణాలు పూర్తి చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం.

– నాగమణి, మండల విద్యాశాఖాధికారి, రాయదుర్గం

విద్యా రంగం నిర్వీర్యం



కూటమి ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యమవుతోంది. గతంలో నాడు–నేడు కింద చేపట్టిన పనులు అన్ని పాఠశాలల్లో అర్ధంతరంగా ఆగిపోయాయి. అదనపు గదుల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి. నాడు–నేడు కింద మిగతా పాఠశాల్లో సౌకర్యాలు కల్పించాలి. పేద విద్యార్థుల సంక్షేమాన్ని కాంక్షించి తల్లికి వందనం అమలు చేయాలి. ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల నిధులు జమ చేయాలి.

– కేడిమి ప్రశాంత్ యాదవ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, రాయదుర్గం

శుభకార్యం

బ్రహ్మసముద్రం : పిల్లలపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి హాజరయ్యారు. నూతన వధూవరులు ప్రవల్లిక,ఆదర్శ కేశవను ఆశీర్వదించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దమల్లారెడ్డి, మనుమంతరెడ్డి, సర్పంచు తలారి గోవిందప్ప, పిల్లలపల్లి అంజి, నాగిరెడ్డిపల్లి గోవింద పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన



50 అడుగుల వాయు శివలింగం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు బీకే యోగీశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 50 అడుగుల వాయులింగ సహస్ర లింగం, ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 27 వరకు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, వాయు లింగ దర్శనం ఉంటుందన్నారు.

హామీలతో కనికట్టు చేసిన మోసగాడు

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, ఎన్నికల హామీలతో కనికట్టు చేసిన మోసగాడు నారా చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. ఆదివారం ఉద్దేహాళ్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి, అధి కారంలోకొచ్చిన తర్వాత ప్రజలను దగా చేస్తున్నారన్నా రు. మాట ఇచ్చి తప్పిన చంద్రబాబును.. మాటపై నిలబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జగన్ విశ్వసనీయత, చిత్తశుద్ధి, సంకల్పం ఎంత గొప్పవో అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు తొమ్మిది నెలల్లో దాదాపు రూ.1.19 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చారన్నారు. మరి అప్పులతో ఎక్కడ సందప సృష్టించారు ? ఉద్యోగాలు ఎన్నిచ్చారని ప్రశ్నించారు.

కూటమి మెడలు వంచుతాం..

సార్వత్రిక ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కూటమి మెడలు వంచుతామని మెట్టు గోవిందరెడ్డి హెచ్చరించారు. హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకుని నిలదీయాలని నారా లోకేష్ చెప్పారని.. ఇప్పుడు ఎవరు కాలర్‌పట్టుకోవాలో లోకేష్, చంద్రబాబు తేల్చుకోవాలన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారో చెప్పకుండా విజన్-2047 పేరుతో మోసానికి తెరతీశారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ఆగడాలను కలిసికట్టుగా ఎదుర్కొందామన్నారు. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం అన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్లు వన్నల్లి రామాంజనేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రాయంపల్లి రామంజి, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పరమేశ్వర, పయ్యావుల సత్యన్న, కందేపల్లి రమేష్, కోటేశ్వర రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, ఫొటో బసవరాజు, విశ్వ నాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వన్నూరు స్వామి, బసవరాజు, వెంకటేశులు, చిక్కన్న, నాగిరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, అంజిరెడ్డి, మురళి, ఎర్రగుంట కేశవరెడ్డి, కేలకుర్తి జయరామ్ రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, తిమ్మప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

ఉద్దేహాళ్‌కు చెందిన మారెష్ భార్య వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త నీలమ్మ (35) అనారోగ్యంతో మృతి చెందింది. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు నీలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శుభకార్యం

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో ఆదివారం జరిగిన మాజీ సర్పంచ్ పెనకలపాటి మారుతీప్రసాద్ కుమార్తె శాంతిప్రియ, రామకృష్ణ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు పరమేశ్వర, కందేపల్లి రమేష్, గౌని ఉపేంద్రరెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, యర్రగుంట కేశవరెడ్డి, కలేకుర్తి జయరామ్‌రెడ్డి ఆలూరు చిక్కన్న, కోటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిడ్డంగులు ప్రారంభించరా?



శివరామిరెడ్డి కాలనీలో నిర్మించిన పౌరసరఫరాల గిడ్డంగులు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పక్కనే నిర్మించిన పౌరసరఫరాల శాఖ గిడ్డంగులను ప్రారంభించడం మరిచారు. ఒక్కో గిడ్డంగి రూ.21లక్షలతో 500 మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యంతో నిర్మించారు. గిడ్డంగులు ప్రారంభించకపోవడంతో పంటలు నిల్వ చేసుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. ఉరవకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులోని అద్దె గోదాముల్లో భద్రపరుచుకోవాల్సి వస్తోంది. తహసీల్దార్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రెండు గిడ్డంగులను ప్రారంభిస్తామన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

కూడేరు: మండలంలోని కడదరకుంటలో భూమి తగాదాలో దళితులు రమేష్ , కురుబ తుప్పటి హరీష్ వర్గీయులు శనివారం ఘర్షణ పడిన విషయం తెలిసిందే. రమేష్ ఫిర్యాదు మేరకు హరీష్‌తోపాటు మరో 14 మందిపైన కేసులు నమోదు చేశారు. తుప్పటి హరీష్ ఫిర్యాదు మేరకు దళిత రమేష్‌తోపాటు మరో 14 మందిపైన కేసులు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

మండే ఎండ



నిర్మానుష్యంగా కనిపిస్తున్న లక్ష్మీబజార్ ప్రధాన రహదారి

వేసవి ప్రారంభం కాకనే భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి నెలలోనే సూరీడు ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ ప్రభావంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఆటో, బస్సు, లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు ఇలా అన్ని వర్గాల వారు అవస్థలు పడుతున్నారు. ఎక్కడ శీతలపానీయాలు, మజ్జిగ, పుచ్చకాయలు, కర్బూజ ఒప్పులు కొనుగోలు చేస్తున్నారు.

– రాయదుర్గంటౌన్:

ఈత..కేరింత!



కుడికాలువ నీటితో సేద తీరుతున్న పిల్లలు

ఫిబ్రవరి మాసంలోనే ఎండలు మండుతున్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటకు వస్తే మండుటెండ.. ఆరుబయటకు అడుగు పెట్టాలంటే జనం జంకుతున్నారు. ఇంకేముందీ.. కాలువలు, బావుల్లో, కుంటల్లో ఎక్కడ నీరు కనిపించినా సరదాగా ఈతకొట్టి సేదతీరాలనిపిస్తుంది.. మండలంలోని హంసాయపల్లి, జల్లిపల్లి, ఉదిరిపికొండ, మరుట్ల, కలగళ్ల, కూడేరుకు చెందిన పెద్దలు, పిల్లలు ఆదివారాన్ని ఆస్వాదిస్తున్నారు. ధర్మవరం కుడికాలువలో ప్రవహిస్తున్న నీటిలో ఈత కొడుతూ ఇలా సేదతీరారు.

– కూడేరు:

కూటమి నేతల దిగజారుడు రాజకీయం





నీళ్లు లేక నిలువునా ఎండిపోతున్న కొబ్బరి చెట్లు, దానిమ్మ చెట్లు

రాయదుర్గం: కూటమి నేతలు దిగజారుడు రాజకీయం చేస్తున్నారని బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పదెకరాల్లో దానిమ్మ, కొబ్బరి చెట్లు నీరులేక నిలువునా ఎండుతుంటే తన పొలంలోనే బోరుబావి తవ్వించానని, నీరు పడిందని సంతోషంగా ఉంటే అంతలోనే పోలీసులు వచ్చి అడ్డుకున్నారని వాపోయారు. శనివారం బోరు తవ్వితే ఆదివారం తన పొరుగు పొలం రైతులతో ఫిర్యాదులు చేయించి కేసులు నమోదు చేయించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. చేతికొచ్చిన దానిమ్మ, కొబ్బరి చెట్లు నిలువునా ఎండుతుంటే అధికార పార్టీ నాయకులు పైశాచిక ఆనందం పొందడం సరికాదన్నారు. పొరుగు రైతుతో తాను 87 సెంట్ల భూమి కొనుగోలు చేసి బోరు తవ్వించానన్నారు. అందులో నీళ్ల పద్దాక భూమి కొలతల్లో వ్యత్యాసం పేరుతో అడ్డుకోవడంతో పాటు కేసులు పెట్టించడం సరికాదన్నారు. కూటమి నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తరు. తనకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్, ఎస్పీల దృష్టికి పార్టీ పెద్దలతో కలిసి తీసుకెళ్తామన్నారు.

26 నుంచి ఎణ్ణే రంగనాథేశ్వర ఉత్సవాలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో వెలసిన ఎణ్ణేరంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత) ఉత్సవాలు ఈనెల 26 నుంచి రెండురోజుల పాటు జరగనున్నాయి. 26న ఉదయం 7:30 నుంచి గంగను తీసుకొచ్చి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. 27న తెల్లవారుజామున 4.30 గంటల నుంచి పల్లకీ ఉత్సవం , ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతి, అన్నదానం జరుగుతుంది. సాయంత్రం 4.30 గంటల నుంచి రథోత్సవం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా 28న ఉదయం 8 గంటలకు రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నిఘా నీడన సంక్షేమ వసతి గృహాలు

- హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- అక్రమాలు, అవకతవకలకు అడ్డుకట్ట
- విద్యార్థులకు పూర్తి భద్రత



సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న రాకెట్ల వసతి గృహం

హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఉరవకొండ: మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వంట సరుకులు పక్కదారి పట్టకుండా, బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా, అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఉరవకొండ సాంఘిక సంక్షేమ సహాయ అధికారి పరిధిలోని అన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మొదటి దశలో మండలంలోని ఆరు సంక్షేమ వసతి గృహాలు, వజ్రకరూరు మండలంలో 3 వసతి గృహాలు, రాయదుర్గం నియోజకవర్గంలోని డీ.హిరేహాళ్ మండలంలోని ఒక వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వసతి గృహంలో మొత్తం 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈసీసీ కెమెరాలు ఏర్పాటుతో విద్యార్థుల రాకపోకలు, స్టడీ అవర్స్ నిర్వహణపై నిరంతరం నిఘా కొనసాగుతుంది. వసతి గృహాల్లోని నిత్యావసర వస్తువులు పక్కదారి పట్టకుండా, అక్రమాలకు తావు లేకుండా నిఘా ఉంటుంది.

వసతి గృహాలకు పూర్తి భద్రత..



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. మొదటి దశలో 9 చోట్ల కెమెరాలు ఏర్పాటు చేశాం. దీంతో వసతి గృహాలకు మరింత భద్రత ఉంటుంది. ఎలాంటి అక్రమాలు జరిగినా చర్యలు తీసుకుంటాం.

– రామ్మోహన్, ఏఎస్‌డబ్ల్యూఓ, ఉరవకొండ